చైనాలో ఆడపిల్లలు ఎగబడి మగపిల్లల్ని పెళ్ళి చేసుకోర్ట. మగపిల్లలే ఆడపిల్లల్ని చేసుకుంటార్ట. కమ్యూనిస్ట్ చైనాలో మగాడికి పెళ్ళి కావడం చాలా కష్టం, బ్రహ్మప్రయత్నమట. కన్యాశుల్కం టూ మచ్చీ త్రీ మచ్చీన్ట. అంత వగలూ, సొమ్ములూ, లాంఛనాలూ, పెళ్ళి ఖర్చులూ పెట్టుకోలేని మగాళ్ళు పోతు తాడిచెట్లలా అలా వుండిపోతున్నార్ట. వాళ్ళ దగ్గర ఖర్చయేది శ్రమశక్తే కాని సృజనశక్తి అంతా వృథా పోతున్నదట.

అంచాత అన్ మారీడ్ యువకులు చైనాలో ఇల్లరికం ఛాన్స్‌కి చాతకపక్షులు వెన్నెల కోసం ఎగబడినట్లు ఎగబడుతున్నార్ట. అసలీ బ్యాడ్ షేపు చైనాకి ఎందుకు వచ్చిందిటంటే –

ఆడపిల్లల్ని పుట్టకుండానే, పుట్టగానే చంపేయడం ... గర్భస్రావాలూ యిత్యాది భ్రూణ హత్యలవల్ల రానురాను – మొగ వెధవలు అల్లా పెరిగిపోతూ ఆడసంతు దవునై దవునై రాను రాను భయంకరమైన షార్టేజి ఏర్పడిపోయిందిట పెళ్ళికూతుళ్ళకి. డిమాండ్ ఎక్కువ సప్లయి తక్కువ అయేసరికి గిరాకీ పెరిగిపోయి – డబ్బున్నవాళ్ళకే పెళ్ళిళ్ళు లేదా ఇల్లరికం పరిస్థితి వచ్చేసిందిట.

మనవాళ్ళు కూడా గర్భస్రావాలూ, భ్రూణ హత్యలకి వెనకాడరు ఆస్తుల కోసం, ఆడపిల్లల్ని కన్న తల్లులదే రాజ్యం అవుతుందని ధీమా –

మన దేశంలో కూడా ఆడపిల్లల సంఖ్య తగ్గి మగపిల్లల సంఖ్య పెరిగితే – టెక్స్టైల్ ఇండస్ట్రీ, కాస్మటిక్సు వగైరా వగైరాలన్నీ దెబ్బతిని – మగపిల్లలకు ఎంత ఎదురిచ్చినా పెళ్ళిళ్ళు కాని రోజు వస్తే – అప్పుడుగాని కథ అడ్డం తిరగదు.

అయితే చైనాలో కూడా ఓ మాటు పెళ్లయాక ద్విగుణీకృతోత్సాహం, కసితో వైఫ్ బీటింగ్ (పెళ్ళాల్ని చితకబాదకం) వుందిట. పెళ్ళాల్ని తన్నడం గురించి మరోమారు ముచ్చటించుకుందాం!

# ఫలశ్రుతి

రసాలా కోతకాయలా మీకేదిష్టం అంటే మీ రేం చెబుతారు? పప్పన్నం తిని పరవాణ్ణం తింటారా, పాయసం తాగి పప్పులను వేసుకుంటారా అని అడిగితే మీరేం చెప్పగల్రు? పేరంటానికి ఫారిన్ సిల్కుది కట్టుకుంటారా పోచంపాడుది కట్టుగుంటారా అని అడిగితే కూడా చెప్పడం మీకు కష్టమే. ఐస్‌క్రీమ్ తిని, కాఫీ తాగి వక్కపొడి వేసుగుంటారా, ఫ్రూట్ సాలెడ్ లాగించి బ్లాక్ టీ తాగి మిఠాయి కిళ్ళీ వేసుగుంటారా అని క్రొశ్నిస్తే మీరు మటుకు ఏం చెప్పగల్రు? ఊహూ చెప్పలేరు. తింటేగాని బోధపడని రుచులు చెప్పగుంటే తీరతాయా? ముద్దు పెట్టుకోవడం గురించి వ్యాసం రాసి పెళ్ళానికి చూపించాడ్ట వో సుబ్బారావు. అప్పుడా ఇల్లాలు

వంటల బొమ్మల పుస్తకం తెచ్చి లడ్డుండల పేజీ త్రిప్పి చూపించిందట. సినీమాల్లో తిండి సీనులు, స్నానాల సీనులు, వర్షం సీనులు, ముద్దుల సీనులు ఎంత వుపయోగకరమో, ఈ బొమ్మల పుస్తకాలు అంతే-కాని అదో సరదా!

మామిడి పళ్ళలో రసాలు గొప్పవా, బంగినపల్లి కోతకాయలు గొప్పవా అని అడిగితే ఎట్లా చెప్పండి? ముద్దు ముద్దే కావిలింత కావిలింతే - దేనికదే టంకుటమా, ఝుంకు ఝుమా.... సెలియా కనరావా!

రసం పండు తినడానికి కొంతమందికి కవి సమయాల్లాటివి వున్నాయ్! అన్నంలో పెరుగో మజ్జిగో పోసుగున్నాక మజ్జిగా అన్నంలో కాస్త పప్పువేసుకుని ఆపైన పండుని పీలుస్తూ ముద్దకి ముద్దా ఎత్తుకోడం. అలా కొంతసేపు పండును పిసికేసరికి తొక్క పలచనయితే విడిపోతూ - రసాన్ని పైకిచిమ్ముతుంది. టెంక పండులోంచి పైకి తన్నేముందు 'వూజింగ్' అంటే రసం చిప్పిలుతుందన్నమాట. టెంకకి పీచు వుండనే వుంటుంది. టెంకని కుడిచేతి బొటనవేలు, చూపుడు వేలు వగైరా వేళ్ళతో చుట్టుముట్టి మూతి దగ్గరికిచేర్చి 'యిష్షూ' అంటూ లోపలికి జుర్రాలి. అప్పుడునోరంతా తియ్యగా అయిపోయి మూతీ పెదిమలు కూడా రసార్ద్రం అయిపోయి కళ్ళు అర్ధ నిమీలిత నేత్రాలవుతాయి. శ్రీ కృష్ణుని వేణుగానం విని యమునలో స్నానం చేస్తున్న గోపికలా అయిపోతారు మీరు. మామిడిపండు మజా అంతా జుర్రడంలో వుంది.

చిన్న పిల్లలు మామిడిపండు జుర్రుతూంటే, ఆ దృశ్యాన్ని చూసే తల్లిదండ్రులు శ్రీ కృష్ణలీలల్ని చూస్తున్నంతగా తన్మయులవుతారు. పండురసం నోట్లోకి వెళ్ళేది కొంచెం, మిగతా యావత్తు ముఖం నిండా పులుముకుని, చేతులు, బొజ్జా, అరికాళ్ళదాకా ఆ రసం వ్యాపించినపుడు వాడు లేదా దాని ఆనందం మహామహా యోగులకి కలిగే బ్రహ్మానందానికేమీ తీసిపోదు. సంసారంలోనే వుంటూ మామిడిపళ్ళు తింటూ ముక్తీమోక్షం కైవల్యం వగైరాలన్నీ సాధింపవచ్చు.

కొంతమంది పెద్ద పెద్ద మీసాల పురుషులుంటారు. ఈ మీసాలవారికి పండు తిన్నాక కూడా మీసాల్ని నాలికతో సవరించుగుంటే రసానుభూతి కలుగుతూ వుంటుంది. భగవంతుడు ప్రత్యక్షమయి వరాలిచ్చి వెళ్ళిపోయాక కూడా ఆయన కనపడ్డచోట కాంతిచిమ్ముతూ వున్నట్లు - మామిడిపండు రసం జుర్రాక కూడా మీసాల సౌభాగ్యంవలన అంతో యింతో సంచితం మిగిలి జీవుల్ని తృప్తుల్ని చేస్తూ ఉంటుంది.

కొంతమంది నాజూకు మనుషులు వెండిగిన్నెలో రసం పిండించుకుని తొక్కతోనూ, టెంకతోనూ ఎటువంటి అనుబంధం లేకుండా వెండిచెమ్చాతోనో, స్టీలు చెంచాతోనో ఆరగిస్తారు. అది మామిడిపండు తినడానికి అపాలజీలాటిది కొబ్బరిబొండాల నీళ్ళు వెండి గ్లాసులోకి వంపుకుని స్ట్రా వేసి తాగినట్లు మామిడిపండు రసాన్ని పీల్చడానికి వలనుపడదు. పళ్ళ రసాలు డైరెక్టుగా ఆరగించాలిగాని మెత్తని పానీయాల రూపంలో సీసాల్లోంచి తాగడం చాలా అమర్యాదకరం.

కొంతమంది విపరీత పురుషులు మామిడిపండు తింటూ సిగరెట్టు కాలుస్తారు. మజ్జిగా అన్నం తింటూ కూడా స్మోక్ చేసేవారున్నారు. కాఫీకి, టీకి సిగరెట్టుతో లంకె కుదిరినట్టు మామిడిపండుకి ఎలా లింకు కుదురుతుంది చెప్పండి, మీ వెర్రిగాని.

దేవుడి దగ్గర మామిడిపండు నైవేద్యం పెట్టినా ఆ పండు మనమే తింటాం కాని దేవుడు తినడుకదా పాపం. దేవుడు కూడా మామిడిపండు తినాలంటే చంటి పిల్లాడి రూపంలో మళ్ళీ అవతరించాల్సిందే. అలా వీలులేనప్పుడు చిలకలానో, మరో పక్షిరూపంలోనో, ఎలుకలానో వచ్చి తినిపోవాల్సిందే. మామిడిపండు రసం జుర్రే శుభవేళ టెంక ఎగిరి మరెక్కడా, మరో తెలుగు విస్తరిమీదగాని, తెలుగు వెలుగుమీద గాని పడకుండా జాగ్రత్త వహించాలి. కొత్తగా పెళ్ళయినవారి శోభనం గదిలో ఓ అరడజను మంచి చెరుకురసాలు పెట్టించారంటే నవ వధూవరులు ఏ ఆనందాన్ని వదులుకోవాలో తెలియక తబ్బిబ్బయి తత్తరపడతారు. కొంతమంది మామిడిపండు తిన్నాక అరటి పండు తినొచ్చా అక్కయ్యగారూ అని అడుగుతారు. అరటి పండు తినాలని వుంటే అరటి పండు తిను నాయనా, దోసకాయ పప్పు తినాలనుంటే దోసకాయ పప్పు తినునాయనా... ఎవరి కర్మవారిది. పాయసం తాగాక ఓ వడియం ముక్కో అప్పడమో నమిలినట్టు మామిడి పండు తిన్నాక మరింకేమీ నోటికంది వుండానికి వీలు లేదు. మంచినీళ్ళయినా సరే. పట్టుబట్ట కట్టుకుని కారాకిళ్ళీ వేసుగున్నట్లు, మామిడిపండు తిని బీడి కాల్చేవాళ్ళున్నారు. అటువంటి వాళ్ళ జీవితాలకు నిష్కృతి లేదు.

కోతకాయ తినడం కొంత సర్జికల్‌గా వుంటుంది. కోతకాయలో టెంకను కాయ నుంచి వేరే చేయవచ్చు - ముఖ్యమంత్రిని మిగతా మంత్రి వర్గం నుంచి వేరుచేసినట్లు. టెంకను ఎంతసేపు చీకినా జీవుడికి పరమాత్ముని తత్వం బోధపడనట్లే వుంటుంది. కోత కాయలు ముక్కలు తరిగి అలిగిన భర్త నోటికి అందించవచ్చు - అతను మళ్ళీ వేలుకొరకడం - అబ్బా నొప్పండి - ఏం చిలిపి వారండీ మీరు అని కోపగించుకోడం 'అలిగితివా సఖీ' అని అతడు పాడలేకపోవడం ఇవన్నీ తదనంతరాలు తందానతానా!

మా బావాగారొకాయన పరమ జాగ్రత్త పురుషుడు. వీధిలోకి వచ్చిన మామిడిపళ్ళ వాళ్ళందరిని పిలిచి బేరాలాడేవాడు. అబ్బో! అయ్యో! బాబోయ్! అనికనుబొమలెగరేసేవాడు కాని కొనేవాడు కాదు అరిచి గీపెట్టినా.

మామిడిపళ్ళ వర్తక సంఘంవారంతా కలిసి మామిడి టెంకెలతో దండగుచ్చి 'వో మాంగోవీరుడ'ని మా బావగారికి దండవేసి హారతిచ్చారు.

మామిడిపండును చూసినా చలింపని మహానుభావులుంటారు - ప్రవరాఖ్యుడు మామిడిపండు తిన్నాడో లేదో...